క్లుప్తంగా

వరద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు



రివర్‌ఫ్రంట్ పార్కు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక ఫ్లెక్సీలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): వరద ప్రవాహం పెరుగుతున్న దృష్ట్యా కనకదుర్గ వారధి పక్కన రివర్‌ఫ్రంట్ పార్క్ వద్ద అధికారులు వరద ప్రమాద హెచ్చరిక ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కారణంగా కృష్ణా నది పోటెత్తుతోంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజీకి సుమారు 3లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో బ్యారేజీ అన్ని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. కృష్ణానదిలో నీటి ప్రవాహం పెరుగుతున్నందున నదిలోకి మానవ సంచారం, పశు సంచారం పూర్తిగా నిషేధించారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నదిలో పశువులను కట్టడానికి ఏర్పాటు చేసుకున్న టైర్లు, కర్రలను ప్రొక్లయిన్‌తో తొలగించారు.

స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఆగస్టు 4వ తేదీ నుంచి తమ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ. పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. కట్టింగ్ అండ్ టైలరింగ్, డ్రస్ మేకింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, జ్యూట్ క్రాఫ్ట్ మేకింగ్ అసిస్టెంట్, ప్రొడక్ట్ మేకర్, బ్యూటీ కేర్ అసిస్టెంట్, మెషీన్ ఎంబ్రాయిడరీ, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్ క్రాఫ్ట్స్ మేకింగ్, స్క్రీన్ ప్రింటింగ్, బాతిక్ ప్రింటింగ్, ఫ్రూట్స్ అండ్ వెజిటెబుల్ ప్రొసెసింగ్ అసిస్టెంట్, డ్రస్ మేకర్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ అసిస్టెంట్, ఫ్యాషన్ జ్యువెలరీ మేకింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలో నేరుగా గానీ, 0866–2470420లో గానీ సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

పక్కాగా పారిశుద్ధ్య నిర్వహణ

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర




పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు నిరంతర పరిశీలన చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన గురువారం కృష్ణలంక, సామిల్ రోడ్డు, పోస్ట్ ఆఫీస్ రోడ్డు, వెంకటరెడ్డి స్కూల్ రోడ్డు, కృష్ణలంక సర్వీస్ రోడ్డులో పర్యటించారు. కృష్ణలంకలో పారిశుద్ధ్య నిర్వహణ చేస్తున్న కార్మికులతో మాట్లాడి వారికి పనిముట్లు సరైనవి ఉన్నాయా లేదా? తోపుడు బండ్లు సరిపడా ఉన్నాయా లేవా? వ్యర్థ సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? ప్రతిరోజు రోడ్లు పరిశుభ్రపరుస్తున్నారా? డ్రైయిన్లలో వ్యర్థాలు తొలగిస్తున్నారా లేదా? వంటి విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వ్యర్థాల సేకరణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే, వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉన్నత స్థాయిని నిలబెట్టుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులు అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ సిబ్బందికి సత్కారం




లబ్బీపేట(విజయవాడతూర్పు): పోలీసు శాఖలో సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యగ విరమణ చేసిన సిబ్బందికి గురువారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీ కేజీవీ సరిత సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుదీర్ఘ కాలం క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించి, ఉద్యోగవిరమణ పొందడం అభినందనీయమన్నారు. ఇన్ని రోజులు చట్టాలకు అనుగుణంగా విధులు నిర్వర్తించారని, మనమంతా ఒకే పోలీసు కుటుంబమని పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో సీసీఆర్‌బీ ఎస్‌ఐ వై. నాగరాజు, ఏఎస్‌ఐ ఎంజీ అబ్బాస్, ఏఆర్‌ఎస్‌ఐ వై. సాయిబాబు, కానిస్టేబుల్ పి. రమేష్, హోంగార్డులు ఎస్. వెంకటరావు, బి. దుర్గాదేవిలు ఉన్నారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్రైమ్ డీసీపీ కె. తిరుమలేశ్వర రెడ్డి, ఏఓ సునీత, ఆర్‌ఐ సురేష్‌రెడ్డి, ఎం. సోమయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వరద కృష్ణమ్మ







జలసవ్వడులతో కృష్ణా తీరం పులకిస్తోంది.. శ్రీశైల మల్లన్న చెంత నుంచి మొదలైన కృష్ణవేణి పరుగు.. నాగార్జున కొండకు నిండుదనం చేకూర్చి.. అక్కడి నుంచి పులిచింతల కిందనున్న పొలాలను తడిపి.. విజయవాడ నగరానికి మణిహారమై కొత్తందాలను తీసుకొచ్చి.. సాగరుడి వైపు బిరబిరా ప్రవహిస్తోంది. కృష్ణమ్మ రాకతో ప్రకాశం బ్యారేజ్ నిండుకుండలా దర్శనమిస్తోంది. దీంతో గేట్లన్నీ ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. అధికారులు నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అందరి భాగస్వామ్యంతోనే డ్రగ్స్ నిర్మూలన

జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ రమణ



ఆటో డ్రైవర్లకు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో విజయవాడ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ) ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని కోరారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల నేర ప్రవృత్తి పెరుగుతోందన్నారు. ముఖ్యంగా బాలలు, యువకులు మాదకద్రవ్యాల వ్యసనంతో తమ జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమేనని, గంజాయి, డ్రగ్స్ సంబంధిత రవాణా, వినియోగంపై టోల్ ఫ్రీ నంబర్ 1972కి సమాచారం అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీం ఎస్‌ఐ వీరాంజనేయులు మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ వినియోగం వల్ల శారీరక, మానసిక రుగ్మతలు తలెత్తుతాయన్నారు.

డీ–ఎడిక్షన్ చికిత్సతో సాధారణ స్థితి..

కార్యక్రమంలో పాల్గొన్న నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలు, యువతకు డీ–ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకు రావచ్చన్నారు. ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు నూజివీడులోని పొలసానపల్లిలో బోస్కో డీ–ఎడిక్షన్ సెంటర్ ద్వారా ఇటువంటి సమస్యలతో బాధపడుతున్న బాలలు, యువతకు ఉచితంగా చికిత్స అందిస్తోందని తెలిపారు. దీనిపై మరింత సమాచారం కోసం 9490492020 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీం, విజయవాడ రైల్వే సీఐటీయూ యూనియన్ ప్రెసిడెంట్ ఏవీ రెడ్డి, కార్యదర్శి కోటయ్య, ఆటో డ్రైవర్‌లు, నవజీవన్ బాల భవన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

- దుర్గగుడి ఈవో శీనానాయక్
- అమ్మవారి సన్నిధిలోకి బయటి ఆహార పదార్థాలు
- అనుమతించిన నలుగురు సెక్యూరిటీ గార్డులపై వేటు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భద్రతా వైఫల్యాలు మరోమారు బయట పడ్డాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పంపిణీ చేసేందుకు బయట తయారు చేసిన ఆహార పదార్థాలను తరలిస్తున్న వ్యవహారం గురువారం సాయంత్రం వెలుగు చూసింది. ఈ వ్యవహారంలో విధుల పట్ల అలసత్వంగా వ్యవహరించిన ముగ్గురు సెక్యూరిటీలు, ఒక హోంగార్డు సూపర్‌వైజర్‌లను ఆలయ ఈవో విధుల నుంచి తొలగించారు. ఆలయ నియమ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అసలేం జరిగిందంటే..

గురువారం సాయంత్రం ఈవో శీనానాయక్ పోరంకిలోని వేద పాఠశాలను సందర్శించి, తిరిగి ఆలయానికి చేరుకునే క్రమంలో మహా మండపం లిఫ్ట్ వద్ద ఓ ఆటో, అందులో కొన్ని హాట్‌బాక్స్‌లతో ఆహార పదార్థాలను గుర్తించారు. మహా మండపం వరకు ఆటోను ఎవరు అనుమతించారని సెక్యూరిటీ సిబ్బందిని ప్రశ్నించారు. అయితే కనకదుర్గనగర్ నుంచి ఆటోను లోపలకు పంపాలని సూచించినట్లు సిబ్బంది పేర్కొన్నారు. అసలు హాట్ బాక్స్‌లలో ఏం ఉన్నాయని ఆరా తీసిన ఈవో విస్మయానికి గురయ్యారు. బయట తయారు చేసిన ఆహార పదార్థాలను ఆలయ ప్రాంగణంలోని కళావేదిక వద్ద పంపిణీ చేసేందుకు తీసుకువచ్చినట్లు తేలింది. దేవస్థానం నుంచి ఎటువంటి అనుమతి లేకుండా ఆహార పదార్థాలు అనుమతించడం, భక్తుల భద్రతను పణంగా పెట్టినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార పదార్థాల నాణ్యతలో ఏదైనా తేడా వస్తే బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. దీంతో ఈ వ్యవహారానికి కారణమై, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన లక్ష్మయ్య, వెంకటేశ్వరరావు, కాశీరావు అనే సెక్యూరిటీ సిబ్బందితో పాటు కాశయ్య అనే సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఈవోఆదేశాలు జారీ చేశారు. అంతే కాకుండా భక్తుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సెక్యూరిటీ ఏజెన్సీకి రూ. 25 వేలు జరిమానా విధించినట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

భావవ్యక్తీకరణ చాలా కీలకం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు చక్కని భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే అద్భుత విజయాలను సొంతం చేసుకుంటారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు సీహెచ్ రమేష్‌బాబు అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఈసీఈ, ఐక్యూఏసీ విభాగాల ఆధ్వర్యంలో 'స్పీక్ టు లీడ్ మాస్టరింగ్ ది ఆర్ట్ ఆఫ్ పబ్లిక్ స్పీకింగ్' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రేరణాత్మకమైన ప్రసంగాలు చేసే దిశగా తమ ప్రతిభకు పదును పెట్టాలన్నారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య, సహాయ కార్యదర్శి గ్రంధి పవన్‌కుమార్ తదితరులు ప్రసంగించారు.

నేషనల్ స్పోర్ట్స్ మీట్‌లో అభిషేక్ ప్రతిభ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి అభిషేక్ జుత్తి 54వ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ నేషనల్ స్పోర్ట్స్ మీట్–2025లో 10 మీటర్ల పీప్ సైట్ ఎయిర్ రైఫిల్ షూటింగ్(అండర్–17 బాలుర) విభాగంలో బ్రాంజ్ మోడల్ (మూడో స్థానం) గెలుపొందాడని కేంద్రీయ విద్యాలయం–01 విజయవాడ ప్రిన్సిపాల్ ఆదిశేష వర్మ చెప్పారు. జూలై 21 నుంచి 25వ తేదీ వరకు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఈ పోటీలు జరిగాయన్నారు. ప్రతిభ చూపిన అభిషేక్‌ను పాఠశాల ఆవరణలో గురువారం అభినందించారు. కోచ్‌గా వ్యవహరించిన భరత్ పాఠక్, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్ ఏడుకొండలు అభిషేక్‌ను అభినందించారు.

విద్యార్థుల ఆరోగ్యాలతో చెలగాటమాడొద్దు

పటమట(విజయవాడతూర్పు): ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థుల ఆరోగ్యాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ కోమలసాయి విమర్శించారు. గురువారం పటమటలంకలోని కొమ్మా సీతారామయ్య జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల, జూనియర్ కళాశాల్లో భోజనం, పాఠశాల, కళాశాల్లో విద్యార్థులకు ఉన్న సౌకర్యాలపై ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పరిశీలనకు వెళ్లారు. ముందస్తుగా అనుమతి తీసుకున్నప్పటికీ విద్యార్థి నాయకులను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో కొద్దిసేపు విద్యార్థి నాయకులకు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

యువ వైద్యులకు స్ఫూర్తిగా నిలిచారు

వైద్యుల ఉద్యోగ విరమణ సభలో ప్రభుత్వ వైద్యశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రభుత్వ వైద్య రంగంలో మూడు దశాబ్దాల పాటు పనిచేసిన డాక్టర్ ఎం. జగన్మోహనరావు, డాక్టర్ ఆర్. సౌజన్య యువ వైద్యులకు స్ఫూర్తిగా నిలిచారని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆలపాటి ఏడుకొండలరావు అన్నారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతిగా ఉన్న డాక్టర్ ఎం. జగన్మోహనరావు, ప్రసూతి విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్. సౌజన్య గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా వారికి వైద్య కళాశాలలోని లెక్చర్ హాలులో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏ వెంకటేశ్వరరావుతో కలిసి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలరావు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు ఆయా విభాగాల్లో వారు అందించిన సేవలను కొనియాడారు. సూపర్‌స్పెషాలిటీ విభాగమైన గ్యాస్ట్రో ఎంట్రాలజీలో డాక్టర్ జగన్మోహన్‌రావు సుదీర్ఘకాలం పాటు పనిచేశారని, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌గా కూడా సేవలు అందించినట్లు ఆయన గుర్తు చేశారు. వారి సేవలను యువ వైద్యులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వారి సేవలను గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యురాలు డాక్టర్ సరళ వివరించారు. జీడీఏ ఏపీ అధ్యక్షుడు డాక్టర్ కొణిదె రవి, రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్యాయం చేస్తోంది కూటమి నాయకులే..

భవానీపురం(విజయవాడపశ్చిమ): జోజినగర్‌లోని 42 ఫ్లాట్ల యజమానులకు వ్యతిరేకంగా సొసైటీ పేరుతో కోర్టులో కేసులు వేసి నోటీస్‌లు ఇప్పించి అన్యాయం చేస్తోంది కూటమి నాయకులేనని వైఎస్సార్ సీపీ మైనార్టీ నేత గౌస్ మొహిద్దీన్ ఒక ప్రకటనలో ఆరోపించారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ఇటీవల బాధితుల దీక్షా శిబిరానికి వెళ్లి వారికి అండగా ఉంటామని తెలిపిన అనంతరం కూటమి నాయకులు అక్కడికి వెళ్లి మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. రెండు దశాబ్దాల క్రితం 42 మంది 2001లో ఫ్లాట్లు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకోగా.. శ్రీలక్ష్మి రామా కో ఆపరేటివ్ సొసైటీ పేరుతో కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి 2017లో నోటీస్‌లు ఇస్తే.. దానికి వైఎస్సార్ సీపీ మాజీ మంత్రులు జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాసరావుకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా స్థానిక ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవ తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని వెలంపల్లి కోరిన విషయాన్ని మరిచిపోయి.. సమస్యను రాజకీయం చేయటం టీడీపీ నాయకులకు తగదని హితవు పలికారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భార్యతో విడిపోయి ఒంటరిగా ఉంటున్న వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. పాసం అయ్యప్ప(34) తాపీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. 9 ఏళ్ల క్రితం మోనిక అనే యువతితో వివాహమైంది. తర్వాత కొంత కాలానికి విభేదాల కారణంగా విడాకులు తీసుకున్నాడు. ఆ తర్వాత మరో మహిళతో సహజీవనం చేయగా కొంత కాలం తర్వాత ఆమె కూడా వదిలి వెళ్లిపోయింది. అప్పటి నుంచి ఒక్కడే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో అయ్యప్ప తల్లి అతను ఉంటున్న ఇంటి వద్దకు వచ్చింది. ఆమెతో తనకు జ్వరంగా ఉందని చెప్పాడు. ఆమె తమ వద్దకు రావాలని కోరినప్పటికీ అంగీకరించలేదు. జ్వరంతో బాధపడుతూ ఒంటరిగానే ఇంట్లో ఉన్నాడు. గురువారం ఉదయం అయ్యప్ప కోసం స్నేహితులు ఇంటికి వచ్చారు. తలుపులు తెరిచి చూడగా అయ్యప్ప రేకుల షెడ్ ఇనుపరాడ్‌కు చీరతో ఉరేసుకొని వేలాడుతూ కనిపించాడు. దీంతో వారు జరిగిన విషయాన్ని అతని అన్న నాగదుర్గారావుకు తెలిపారు. దీంతో అయ్యప్ప తల్లిదండ్రులు అక్కడికి వచ్చి అతనిని ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. దీనిపై అతని తండ్రి పాసం శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉమ్మడిశెట్టి సేవలు అభినందనీయం



ఉమ్మడిశెట్టిని సత్కరిస్తున్న కమిటీ ప్రముఖులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొత్తపేట హిందూ హైస్కూల్ గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు విద్యారంగానికి అందించిన సేవలు అభినందనీయమని ఆ విద్యాసంస్థ కార్యదర్శి కేఎల్వీ మోహనరావు అన్నారు. 36 ఏళ్లగా గణిత శాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహించిన ఉమ్మడిశెట్టి వెంకటేశ్వరరావు ఉద్యోగ విరమణ కార్యక్రమం హిందూ హైస్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మోహనరావు కమిటీ ఉపాధ్యక్షులు అన్నం రామకృష్ణారావు, కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ తూనికుంట్ల శ్రీనివాసలతో కలిసి తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కమిటీ ఉపాధ్యక్షులు అన్నం రామకృష్ణారావు, కేబీఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడిశెట్టి సేవలను కొనియాడారు. అనంతరం వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. హిందూ హైస్కూల్ కమిటీ అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ వి. నారాయణరావు, కేబీఎన్ కళాశాల ఎగ్జిక్యూటివ్ అధికారి ఎస్. శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు కంచర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులకు ఇంటర్వ్యూలు



ఏసీ చాంబర్ ఎదుట తమ వంతు కోసం వేచి ఉన్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రతి నిత్యం సాయం సంధ్య వేళ దుర్గాఘాట్‌లో కృష్ణమ్మకు నిర్వహించే నవ హారతులను ఇచ్చేందుకు అర్చకులు, పరిచారకులకు దేవస్థానం గురువారం ఇంటర్వ్యూలను నిర్వహించింది. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని మహామండపం నాల్గో అంతస్తులో ఏసీ రంగారావు చాంబర్‌లో ఈ ఇంటర్వ్యూలు జరిగాయి. గత ఏడాది సెప్టెంబర్ 17వ తేదీన నుంచి కృష్ణమ్మకు నవ హారతులను ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అప్పటి దేవస్థాన ఈవో రామరావు, వైదిక కమిటీ సభ్యులు మొత్తం 27 మంది అర్చకులను హారతుల కోసం నియమించారు. దాదాపు 11 నెలలు అవుతున్నా ఇంత వరకు వారికి ఎటువంటి జీతభత్యాలు చెల్లించలేదు. దీనిపై విధులు నిర్వర్తిస్తున్న అర్చకులు దేవదాయ శాఖ కమిషనర్‌కు పలు మార్లు వినతి పత్రాలను అందించారు. దీంతో స్పందించిన దేవదాయ శాఖ అర్చకులకు గౌరవ వేతనం ఇవ్వాలని నిర్ణయించింది.

నియామకాలు ఇలా..

ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న 27 మందికీ ఇంటర్వ్యూలు నిర్వహించింది. దేవస్థాన ఏసీ రంగారావు పర్యవేక్షణలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు కోట ప్రసాద్, అర్చకులు రంగావఝల శ్రీనివాసశాస్త్రిలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 27 మందిలో కొంతమంది ఇతర ఆలయాలు, వైదిక కార్యక్రమాలకు 9 మంది హాజరవుతున్నట్లు గుర్తించారు. మిగిలిన 18 మందిలో 9 మందిని అర్చకులుగా, మరో 9 మంది పరిచారకులు ఎంపిక చేసి ఆలయ ఈవో శీనానాయక్‌కు ఆ వివరాలను అందజేశారు. వీరికి దేవదాయ శాఖ నుంచి అనుమతి రావాల్సి ఉందని తెలుస్తోంది.

విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



విద్యార్థినులకు కిట్లు వితరణ చేసిన మానవత సంస్థ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం లేబర్‌కాలనీలోని జీఎస్‌ఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నోట్ బుక్స్, కెరీర్ గైడెన్స్ బుక్‌తోపాటు టవల్, పేస్ట్, బ్రష్‌తో కూడిన కిట్లను వితరణ చేసింది. ఈ సందర్భంగా మానవత విజయవాడ శాఖ ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ వేమూరు బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు చేతనయినంత సహాయం చేయాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు. అందులో భాగంగానే గత రెండేళ్ల నుంచి ఈ పాఠశాలలో ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించామని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆరో తరగతి విద్యార్థులకు ప్రాథమిక భావనలను బోధించేందుకు ప్రత్యేకంగా ఒక విద్యా వలంటీర్ నియమించి ఆమె జీతం కూడా సంస్థే చెల్లిస్తోందని చెప్పారు. అలాగే పాఠశాల పూర్వ విద్యార్థికి కళాశాల ఫీజు చెల్లించడంతోపాటు ల్యాప్‌టాప్ అందించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీఎస్ గణేష్, ఉపాధ్యాయులు కె. లక్ష్మీనారాయణ, ఆర్‌బీ ఉదయ్ కిరణ్, అనురాధ, మనోజ్ కుమార్, సంస్థ ప్రధాన కార్యదర్శి దావులూరి సాంబశివరావు, ఉమ్మడి జిల్లా కార్యవర్గ సభ్యురాలు కడియాల శాంతి పాల్గొన్నారు.



పోలీస్ కమిషనరేట్‌లో గురువారం శబ్దకాలుష్యం కలిగిస్తున్న ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను పోలీసులు తీసేసి రోడ్ రోలర్‌తో తొక్కించారు. కార్యక్రమంలో డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, సీపీ రాజశేఖరబాబు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11కేవీ మసీదు ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి. రవీంద్రబాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అల్లుడు పేట, బ్యాంక్ సెంటర్, సుధాకర్ మెడికల్ షాప్ రోడ్, రాజేంద్ర వీధి, రంగూన్ సాహెబ్ వీధి, నాగార్జున వీధి, మసీదు రోడ్, కరకట్ట, ఆలివ్ ట్రీ హోటల్ వెనుక వైపు, సైన్స్ సెంటర్ ఏరియా, కోళ్లఫారం రోడ్, మానవ మందిరం రోడ్, అమృత అపార్ట్‌మెంట్ రోడ్ ప్రాంతాల్లో కరెంట్ నిలిపి వేయనున్నట్లు వివరించారు.

వేద విద్యార్థులకు అన్ని సదుపాయాలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేద పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని ఈవో శీనానాయక్ పేర్కొన్నారు. పోరంకిలోని వేద పాఠశాలను ఆలయ ఈవో శీనానాయక్ గురువారం పరిశీలించారు. వేద విద్యార్థులతో మాట్లాడిన ఈవో వారికి బోధిస్తున్న పాఠాలు, పాఠ్యాంశాలపై ఏమైనా ఇబ్బందులున్నాయా అని ఆరా తీశారు. అనంతరం విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులను చూసేందుకు విచ్చేసిన తల్లిదండ్రులతో మాట్లాడారు.